ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





గిరిజనుల అభివృద్ధికి కృషి

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గిరిజనుల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఒంగోలు అంబేద్కర్ భవనంలో అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు.ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు , జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌తో కలిసి మంత్రి స్వామి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ నాయక్ అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం ఒకటో తేదీన ఉద్యోగులందరికీ జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఒకటో తేదీన పింఛను అందిస్తున్నామన్నారు. గిరిజనులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. ట్రైకార్ రుణాలను వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పునరుద్ధరించి గిరిజనులందరినీ ఆర్థికంగా బలోపేతం చేస్తామన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం గహనిర్మాణానికి రూ.4 లక్షల ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగ నియామకాల కోసం డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చిందని, శి క్షణ పొందే 5 వేల మంది ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఉచితంగా వసతి కల్పించి శిక్షణ ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ గిరిజన ప్రజల శ్రేయస్సు, అభ్యున్నతి కోసం పనిచేసిన మహనీయులను గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో యానాదులు ఎక్కువగా నివసిస్తున్నారన్నారు. గతంలో కులాలు ఉండేవి కావని, అందరూ కలిసి ఉండేవారని, ఇప్పుడు కులాలకతీతంగా అందరూ కలిసి ఉండాలన్నారు. వేట చేసి జీవనం సాగించే యానాదులకు గుర్తింపు కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోతురాజు కాలువ వెంట ఉండే గహాల వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరలో వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ప్రసంగించారు. అనంతరం అతిథులను అఖిల ▶ 2లో

అందరి నోటా 'వెలిగొండే'

- ప్రాజెక్టు పూర్తికి చర్యలు పూజ్యం
- పరిహారం కోసం నిర్వాసితుల ఎదురు చూపులు
- నిర్లక్ష్యంతో నీటిని వినియోగించుకునే అవకాశం కోల్పోయిన వైనం



వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

అధికారం మారినప్పటి నుంచి అందరి నోటా వెలిగొండ ప్రాజెక్టు పేరే వినిపిస్తోంది. 'వెలిగొండ' తొలి ప్రాధాన్యతగా చెబుతున్నారు. ఎన్నికలకు ముందూ ఇదే మాట చెప్పారు. అధికారంలోకి రాగానే వెలిగొండను పూర్తిచేస్తామని చెబుతూనే ఉన్నారు.ఈమాట ఇరవైఏళ్ల నుంచి వినిపిస్తోంది. పనులు ఆఖరు దశకు చేరాయి. అయినా పదేళ్ల నుంచి ముఖ్య మంత్రులు ఏటికేడు దీన్ని ప్రారంభిస్తామని చెప్పి చేయలేక పోయారు. 2014-నుంచి 19 వరకూ చంద్రబాబు ఇదే మాట చెబుతూ కాలం గడిపారు. ఆయన కాలంలో పనులు పూర్తికాలేదు. ప్రారంభించే అవకాశం కోల్పోయారు. తర్వాత వైఎస్ జగన్ సిఎం అయ్యాక అదే మాట ఐదేళ్ళూ చెబుతూ వచ్చారు.ఆఖరు నిమిషంలో అంటే ఎన్నికలకు ముందు పనులు పూర్తికాకుండానే శిలాఫలకం వేశారు. బహుశా మళ్లీ అధికారంలోకి రాలేమనుకున్నారో లేక ఎన్నికల్లో లబ్ధి చేకూర్చుతుందని భావించారో తెలియదుగాని సరిగ్గా ఎన్నికలకు ముందే దీన్నీ ప్రారంభించారు. నిర్వాసితులను దరిదాపుల్లోకి కూడా రానివ్వ లేదు.రైతులను కూడా పిలవలేదు. కారణం అక్కడ రైతులకు ఇవ్వడానికి నీళ్లులేవు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదు. ఇపుడు అధికారం మారింది. జిల్లా మంత్రి డోలావీరాంజనేయస్వామి జిల్లాలోకి అడుగుపెట్టిన రోజున ఆయన స్వగ్రామంలో నిర్వహించిన విజయోత్సవసభలో వెలిగొండను పూర్తిచేస్తామని చెప్పారు. త్వరలోనే ప్రారంభించి రైతులకు నీళ్లిస్తామని చెప్పారు.ఆయన చెప్పినట్లుగా నిర్వాసితులకు వెంటనే పరిహారాలు ఇచ్చినట్లయితే గ్రామాలు ఖాళీచేసేవాళ్లు. ఇపుడు శ్రీశైలం నుంచి భారీగా వరదనీరు దిగువకు వెళుతోంది.ఆనీటిని వినియోగించుకునే అవకాశం కూడా కలిగేది. దాన్ని కోల్పోయాం. వాస్తవానికి ఈ తప్పిదం గత ప్రభుత్వానిదే. ఎందుకంటే ప్రాజెక్టును ప్రారంభించిన అప్పటి సిఎం జగన్ నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వాలన్న ఆలోచనమ చేయలేదు. నిధుల కొరత కారణంతో దాన్ని ప్రాధాన్యతగా తీసుకోలేదు. రూ.1,200 కోట్లు నిధులు ఇస్తే నిర్వాసితుల సమస్య పరిష్కారం అయ్యేది. ప్రారంభించేనాటికి అన్నీ పూర్తిచేస్తే ఇపుడు రైతులకు నీళ్ల ఇవ్వడానికి వీలుండేది.అలా జరగలేదు. ఇప్పటికీ నిర్వాసితులు పరిహారం కోసం ▶ 2లో

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య
- బిపిసిఎల్ పైపులైన్ పనులు అడ్డగింత

పజాశక్తి-సంతనూతలపాడు

రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పైపులైన్ ఏర్పాటు చేయాలని, లేకుంటే రైతులతో కలసి పోరాటం చేయాల్సి వస్తుందని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య, జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మైనంపాడు గ్రామంలో రైతుల భూముల్లో ఏర్పాటు చేస్తున్న బిపిసిఎల్ పైప్‌లైన్ పనులను రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆదివారం అడ్డుకున్నారు. పనులు నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా వి. కృష్ణయ్య, పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం సెంటుకు రూ.25 వేల వంతున చెల్లించాలన్నారు. నష్టపరిహారం చెల్లించకుండా పైపులైను పనులు నిర్వహించడం సమంజసం కాదన్నారు. రైతులకు



పైపు లైన్‌ను పరిశీలిస్తున్న నాయకులు



పైపు లైన్ పనులను అడ్డుకుంటున్న నాయకులు

వాస్తవాలు చెప్పి పూర్తి నష్ట పరిహారాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పైపులైను ఏర్పాటు కోసం 16 మీటర్లు వెడల్పుతో తవ్వుతున్న విషయాన్ని రైతులకు చెప్పడం లేదన్నారు. పైపులైన్ ఏర్పాటు చేసిన తర్వాత ఎప్పటిలాగే పంటలు సాగు చేసుకోవచ్చుని వారు చెబుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో పల్నాడు జిల్లాలో రైతులకు పంట నష్టంతో సహా పూర్తి నష్ట పరిహారం చెల్లించ తర్వాతే పైపులైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ కూడా అలాగే చేయాలన్నారు. పేర్నమిట్ట గ్రామంలో చెరువులో నుంచి కాకుండా బయట నుంచి పైపులైను ఏర్పాటు చేయాలని రైతులు పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రైతులు కోరిన విధంగానే పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే రైతులతో పోరాటం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు గ్రామ రైతులు, రైతు సంఘం నాయకులు కిలారి పెద్దబ్బాయి , అన్ను సుబ్బారావు , కరిచేటి హనుమంతరావు, బత్తుల సుబ్బారావు, గుండవరపు రామయ్య, ఆళ్ల అంజయ్య పాల్గొన్నారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

- 13మందికి తీవ్ర గాయాలు
- స్వల్పంగా గాయపడిన పలువురు
- బాధితులను పరామర్శించిన సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

అప్పటి వరకూ వారంతా కలిసి పనులు చేశారు. ఇంటికొచ్చేందుకు ట్రాక్టర్‌పై బయలు దేరాడు. మార్గమధ్యలో ట్రాక్టర్ బోల్తా కొట్టింది. 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరి కొందరు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా మారు మ్రోగింది.

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి 25 మంది మహిళలు వ్యవసాయ పనుల నిమిత్తం చీమకుర్తి మండలం కంభంపాడు గ్రామానికి ఆదివారం వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి బయలు దేరారు. ఒంగోలు-నంద్యాల రాష్ట్ర రహదారిపై మర్రిపూడి మండలం అగ్రహారం గ్రామం వద్ద వచ్చే సరికి వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌కు సంబంధించిన ▶ 2లో

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పొదిలి మండలం కాటూరివారిపాలెంకు చెందిన వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఒంగోలు కిమ్స్, రిమ్స్ హాస్పిటల్స్ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ రోజువారీ కూలీ పనులు చేసుకుని జీవించే మహిళలు ఉపాధి, వైద ్యఖర్చులకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.ఈ నేపథ్యంలో బాధితుల కుటుం బాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.

అందరి నోటా 'వెలిగొండే'

(మొదటిపేజీ తరువాయి)

ఎదురు చూస్తున్నారు. కనీసం సౌకర్యాలు లేని గ్రామాల్లోనే బతుకులు సాగిస్తున్నారు. ఎందుకంటే గ్రామాలు ఖాళీచేస్తారనే ఆలోచనతో ఎలాంటి సౌకర్యాలను అభివృద్ధి చేయలేదు. శిథిలాల మధ్యలోనే ఉంటున్నారు. దెబ్బతిన్న ఇళ్లను కూడా బాగుచేసుకోలేదు.ఎటూ పోతున్నామనే భావనలో ఉన్నారు. ఇళ్లకు రంగులు కూడా లేవు.రోడ్లు లేవు.తాగునీటి సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అక్కడే ఉంటూ పొలాలను పండించుకుంటున్నారు. అన్ని ముంపు గ్రామాల్లో ఇదే పరిస్థితి. వెలిగొండకు మహర్దశ ఎప్పుడా అని ఎదురుచూస్తున్నారు. సొరంగాల్లో లైనింగ్ పనులు పూర్తి చేయాలి.ప్రస్తుతం అవి కొనసాగుతున్నాయి.కొత్తగా వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియా కూడా వెలిగొండ ప్రాజెక్టునే ప్రధాన ఎజండాగా చెప్పారు. కనిగిరి ప్రాంతంలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి కూడా వెలిగొండపైనే ప్రధానంగా చెప్పారు.ఇలా అందరూ వెలిగొండ మీదే ఉన్నారు. దాన్ని సార్థకత చేసే చర్యలు కనిపించడం లేదు. ఇప్పటికైనా బహుళ ప్రయోజనాలున్న వెలిగొండపై సిఎం చంద్రబాబు దృష్టిసారించాలి. అవసరమైన నిధులు ఇవ్వాలి. రైతులకు నీళ్లిచ్చే అవకాశం ఉన్నా దాన్ని ఈఏడాది కోల్పోయామనే విషయాన్ని జిల్లా నేతలు గుర్తించాలి. వెలిగొండపై ఉన్నతస్థాయి సమీక్ష జరిగితేనే ఫలితం ఉంటుందని భావిస్తున్నారు. ఆ దిశగా మంత్రులు దృష్టి సారించాల్సి ఉంది.

గిరిజనుల అభివృద్ధికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

భారత గిరిజన ఉద్యోగుల సంఘ నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాధరావు, గిరిజన సంఘాల, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా..

13 మందికి తీవ్ర గాయాలు

(మొదటిపేజీ తరువాయి)

చింతకాయ విరిపోయింది. దీంతో ట్రక్కు ట్రాక్టర్ నుంచి విడిపోయింది. అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరికి స్వల్ప గ్రాయాలయ్యాయి. స్థానికులు 108 వాహన సిబ్బంది సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మన్నెం పద్మ, డేరంగుల విజయ, వల్లపు ధనలక్ష్మి, నాగాల కళ్యాణి, గొబిశం రజిత, బొల్లినేని సుభాషిణిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. వల్లెపు సుమలత, కుంచాల ఆదిలక్ష్మి పొదిలిలోని ఉడుముల వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

రెచ్చగొట్టే పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారు

ప్రజాశక్తి-పామూరు

కుల మతాలను రెచ్చగొట్టే పార్టీలకు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌వి నారాయణ అన్నారు. ఆదివారం సిపిఐ శిక్షణ తరగతుల ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్యలను పక్కదారి పట్టించి తిరుపతి లడ్డు పేరుతో కుల మతాలను రెచ్చగొట్టడం హేయమని అన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్య పెరిగిందని అన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. మతోన్మాదాన్ని తిప్పికొట్టేందుకు విద్యార్థులు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కమ్యూనిస్టు పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. కుర్చీల కోసం పార్టీలు మారే నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముగింపు కార్యక్రమంలో కనిగిరి సిపిఐ నాయకులు యాక్సిన్, మౌలాలి, ప్రభాకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల చేయూత

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

విజయవాడ వరదలకు నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు దాతలు చేయూతనందిస్తున్నారు. హనుమంతునిపాడు మండలం సీతారాంపురం గ్రామ టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 1,11,116 రూపాయల విరాళాలను సేకరించి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డికి గ్రామ తెలుగుదేశం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులకు, గ్రామ ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి, సౌలు తదితర తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



విరాళాలను అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

సేవా సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నారై సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పాతూరి సంపత్ సూచనలతో సంతనూతలపాడుకు చెందిన నర్సింగ్ విద్యార్థిని నల్లగట్ల తులసికి ఖర్చుల నిమిత్తం 10,000 రూపాయలను అందించారు. అలాగే ట్రస్ట్ స్నేహితురాలైన షేక్ హజీరా బేగం బంధువులకు వైద్య ఖర్చుల నిమిత్తం 5,000 రూపాయలను, సంతనూతలపాడుకు చెందిన ఒక మూగ మహిళకు నిత్యవసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల రామ్‌గోపాల్, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రావులపల్లి సురేష్ బాబు, ట్రస్ట్ సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, కురిచేటి రమేష్, శీలం మల్లారెడ్డి, షేక్ హజీరా బేగం తదితరులు పాల్గొన్నారు.

బాలాజీకి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పొదిలి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని ఒంగోలులోని ఆయన కార్యాలయంలో ఆదివారం స్థానిక పొదిలి మేజర్ పంచాయతీ సర్పంచ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జాజం వెంకటేశ్వర్లు మృతి తీరనిలోటు

శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పామూరు



నివాళులర్పిస్తున్న ఉగ్ర

టిడిపి నాయకులు, పామూరు పంచాయతీ మాజీ వార్డు నెంబర్ జాజం వెంకటేశ్వర్లు మృతి వారి కుటుంబానికి తీరని లోటు అని, ఆ కుటుంబానికి అండగా ఉంటానని కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. జాదం వెంకటేశ్వర్లు అనారోగ్యంతో వైద్యం పొందుతూ చెన్నయ్‌లో మృతి చెందారు. ఆదివారం ఆయన కుటుంబాన్ని ఉగ్ర నరసింహారెడ్డి పరామర్శించి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉగ్ర వెంట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎల్ఎన్ పురం ఎంపీటీసీ బొల్లా నరసింహచౌదరి, దయిండే తిరుపతయ్య, డి శంకర్, వీరాంజి, శ్రీనివాసులు, అమీర్‌బాబు, ఈవీ కోటిరెడ్డి, పాల్గొన్నారు.



సాత్విక్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి

సాత్విక్‌రెడ్డికి జడ్‌పిటిసి తిరుపతిరెడ్డి నివాళి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం రామలింగాపురం గ్రామ సర్పంచ్ గజ్జల నాగేశ్వరరెడ్డి మనువడు గజ్జల సాత్విక్‌రెడ్డి అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి రామలింగాపురం గ్రామంలో ఆదివారం సాత్విక్‌రెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ గజ్జల నాగేశ్వరరెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మాజీ జెడ్పిటిసి రామన తిరుపతిరెడ్డి, వైసిపి నాయకులు నాగూర్ యాదవ్, కుప్పనబోయిన వెంకటరామయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొప్ప వెంకటరెడ్డి, రాగిపిండి కృష్ణారెడ్డి, తాతపూడి నాని పాల్గొన్నారు.

దావా సమన్లు

అండర్ ఆర్డర్ ఆఫ్ 5 రూల్స్ 1&5 అఫ్ సి.పి.సి.
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.344/2023

సంగాని అంకిరెడ్డి ..... వాది
వర్సెస్
బత్తుల వెంకటేశ్వర్లు మరియు వగైరా ...ప్రతివాది
టు
మొదటి ప్రతివాది : బత్తుల వెంకటేశ్వర్లు
తండ్రి మాలకొండయ్య
సాకిన్ : పెరంగుడికొత్తపల్లి గ్రామం,
కనిగిరి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరున వాది Specific performance దావా మీపై దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలున్నచో తే: 22-10-2024 దిన పగలు 10 గంటలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడర్ ద్వారా గాని, పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్ పార్టీగా తీర్మానించబడునని తెలుసుకోనేది.

// By order of the court //

వాయిదా తేది : 22-10-2024
కనిగిరి
తేది: 28-09-2024 **అబ్దుల్ గఫార్ షేక్**
వాది తరుపు న్యాయవాది
కనిగిరి, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి, కోర్టులో
O.S.No : 382/2022

పులి ఖండం వెంకటేశ్వరరెడ్డి ......వాది
V/s
యర్రా శాంతమ్మ మరి ముగ్గురు ...ప్రతివాదులు
To
D3) యర్రా సాయి కార్తీక్ @ కార్తీక్
S/o బ్రహ్మానందం, కొమ్మినేనివారిపాలెం (గ్రామం),
బల్లికురవ (మండలం), బాపట్ల (జిల్లా)

పై తెలిపిన దావాలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేయునది. ఏమనగా పై నంబరు దావా తే 30-10-2024దికి మీ నోటీసు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున మీరు పై తేదిన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని.లకు స్వయముగా గాని, లేక వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో //

అద్దంకి
29-09-2024 **ఇంటూరి హనుమంతరావు**
బి.కాం.,బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, అద్దంకి
సెల్ : 9849045636

దొడ్డిచింతలలో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని దొడ్డిచింతల గ్రామంలో సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సర్పంచ్ బ్రహ్మారెడ్డి వందరోజుల పాలన పూర్తి అయిన సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం చేసిన మంచి పనులను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కోటపాటి శ్రీనివాస్ రెడ్డి, గోన సౌలు, బొజ్జా ఎఫ్రాయిం, సానికొమ్ము నారాయణరెడ్డి, బూత్ ఇన్‌చార్జి కోర్రు బాబు, మొనపాటి నారాయణ, గాదా వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నోటీసు

అండర్ ఆర్డర్ 39 రూల్స్ 1 & 2 ఆఫ్ సి.పి.సి.
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. నెం. 1069/2023
ఓ ఎస్ నెం 344/2023

సంగాని అంకిరెడ్డి ....పిటిషనర్
వర్సెస్
బత్తుల వెంకటేశ్వర్లు మరియు వగైరా
....1st Respondent
టు
1st Respondent : బత్తుల వెంకటేశ్వర్లు
తండ్రి మాలకొండయ్య
సాకిన్: పెరంగుడికొత్తపల్లి గ్రామం
కనిగిరి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరున పిటిషనర్ మీపై అండర్ ఆర్డర్ 39 రూల్ 1&2 ఆఫ్ సి.పి.సి పిటిషన్ దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలున్నచో : 22-10-2024దిన పగలు10 గంటలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడర్ ద్వార గాని, పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్ పార్టీగా తీర్మానించబడునని తెలుసుకోనేది.

// By order of the court //

వాయిదా తేది : 22-10-2024
కనిగిరి
తేది : 28-09-2024 **అబ్దుల్ గఫార్ షేక్**
వాది తరుపు న్యాయవాది
కనిగిరి, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P No: 96/2019
IN
O.S.No: 122/2017

బీరం బాలరంగారెడ్డి .. D.H.R
వర్సస్
సయ్యద్ యూసుఫ్ బాబా .. J.D.R
To
J.D.R చిరునామా
సయ్యద్ యూసుఫ్ బాబా
తండ్రి లేట్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్,
వయస్సు 35 సంవత్సరాలు,ముస్లిం,వ్యాపారం,
నివాసం: 5వ వార్డు, చాకలి వీధి, గిద్దలూరు టౌన్,
గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు E.Pలో D.H.R మీ నుండి E.P పరిహారం రాగోరి పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ:01-10-2024న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీఆక్షేపణ లుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 29-09-2024 **ఇట్లు**
శ్రీ భూపని వెంకటేశ్వరరావు,
D.H.R తరపు న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్ర ప్రదేశ్.
సెల్ నెం : 9866008671

ప్రజాశక్తి
3
సోమవారం 30 సెప్టెంబరు 2024

రహదారులపై ఆవుల సంచారం

మార్కాపురంలో ట్రాఫిక్ సమస్య తీవ్రం

ఆవులతో పొంచివున్న ప్రమాదం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ ప్రధాన రహదారులు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. వాహనాల రాకపోకలతో రద్దీ పెరిగింది. ఏటికేటికీ జనాభా అధికమవుతోంది. వీటన్నింటితో పాటు ఆవుల సంచారంతో మరింతగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రహదారులే ఆవాసాలుగా ఏర్పరచుకున్న ఆవులు ట్రాఫిక్ సమస్యతో ఆగిపోలేదు. ఆవుల సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.



పట్టణంలోని రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న ఆవులు

మార్కాపురం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మారింది. త్వరలో జిల్లా కేంద్రం కూడా కాబోతోందని ప్రచారం జరుగుతోంది. వివిధ అవసరాల రీత్యా మార్కాపురం పట్టణానికి నిత్యం జనం రావడం జరుగుతోంది. మార్కాపురం పట్టణ జనాభా లక్ష దాటిందని అంచనా. బయట నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య కూడా 50 వేలకు తగ్గదని అంచనా. పట్టణంలో కార్లు, మోటారు సైకిళ్లు పదివేలకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితో పాటు ఆర్టీసీ బస్సులు, లారీలు తిరుగుతుంటాయి. ఏ రహదారి చూసినా ఎక్కడోక చోట నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతూనే ఉంది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోతున్నారు.

పట్టణంలో ఆవుల సంచారం పెద్ద తలనొప్పిగా మారింది. జనాభాతో పాటు రోజు రోజుకూ ఆవుల సంఖ్య పెరుగుతోంది. దేవుడి ఆవులని కొందరంటారు. కానీ ఇక్కడ సంచరిస్తున్న ఆవులన్నింటికీ యజమానులు ఉన్నారు. రాత్రి ప్రొద్దుపోయిన తరువాత ఎవరి యజమాని ఇంటికి అవే పోవడం జరుగుతోంది. ఉదయాన్నే వాటిని రహదారులపైకి తోలడం యజమానులకు అలవాటుగా మారింది. ఆవులకు వ్యాపారులు దుకాణాల్లో మిగిలిన వ్యర్థాలను పెట్టడం, కొందరు గృహాల్లో నుంచి బియ్యం పెట్టడం జరుగుతోంది. అలవాటు పడిన ఆవులు ఆహారం కోసం వీధి వీధిలో సంచరిస్తుంటాయి. ఇక్కడి ఆవులు గడ్డి ఆహారంగా తీసుకోవడం మానేశాయని చెప్పవచ్చు. బియ్యం, పండ్లు, పిండి పదార్థాల కోసం గృహాల వద్ద, వ్యాపార సముదాయల వద్ద ఆవులు ఎదురు చూస్తుంటాయి. రహదారులపై ఇలా గుంపులుగా సంచరిస్తుంటాయి. లేత దూడలు కలిగిన ఆవులు తన దూడను ఏమైనా చేస్తారనే కోపంతో అటుగా వచ్చిన పెద్దలను, చిన్నారులను పొడుస్తున్నాయి. దీంతో అక్కడక్కడా ప్రమాదాలు జరిగాయి. ఒక్కోసారి ఆవుల్లో ఆవులే పోట్లాటకు దిగుతాయి. రహదారులపై గెంతులేస్తాయి. ఆ సమయంలో వాహనదారుల్లో, పాదాచారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతుంటాయి. ఈ విధంగా ఆవులతో తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ఆవుల పోట్లాటతో ప్రజలకు ముప్పు తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు.

మార్కాపురం మున్సిపల్ అధికారులు రహదారులపై సంచరించే ఆవుల యజమానులను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా హెచ్చరిక జారీ చేస్తే ఎవరి ఆవులను వారు ఇళ్ల వద్ద పెంచుకుంటారు. లేని పక్షంలో రహదారులపై ఆవులను ఇతర ప్రాంతాల్లో గోశాలలకు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోని పక్షంలో ఆవులతో జరిగే ప్రమాదాలకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

బీచ్‌లో చెత్తకుండీల ఏర్పాటు

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం బీచ్‌లో చెత్త సేకరణకు సిమెంట్ కుండీలను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలియజేశారు. మత్స్యకార సంక్షేమ సమితి, మెరైన్ పోలీసుల అభ్యర్థన మేరకు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు, శ్రీవాణీ విద్యానికేతన్, కొత్తపట్నం వారు బహూకరించిన సిమెంట్ ఒరలతో ఏర్పాటు చేసిన ఈ మూడు చెత్త కుండీలను మెరైన్ పోలీసులు కె.పల్లెపాలెం బీచ్‌లో ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం స్టార్ ఫౌండేషన్, హైదారాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 20వ విడత కార్యక్రమంలో భాగంగా షుగరు, బీపీ వ్యాధులకు సంబంధించి 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్రీమతి ఎస్.లత రెడ్డి, విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ కె.ఎల్.నాగేశ్వరరావు, దుర్గా ప్రసాద్, స్వాతి, డాక్టర్ దీవి వరప్రసాద్ పాల్గొన్నారు.

మైనర్.. తగ్గించాలి జోరు..

బైక్‌లు, ఆటోలు నడుపుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణంలో మైనర్ యువకులు యథేచ్ఛగా ద్విచక్ర వాహనాలు, ప్యాసింజర్ ఆటోలు నడిపేస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ విధుల్లో ఉండే పోలీసులు ఎదుటే మైనర్ యువకులు ద్విచక్ర వాహనాలు, ఆటోలను నడుపుతూ ప్యాసింజర్లను ఎక్కించుకుంటున్నారు. ఒక ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని రోడ్లపై తిరిగేస్తున్నారు. ఏదైనా ఘటన జరిగితే అప్పటికప్పుడు హడావుడి చేసి ఆ తరువాత మిన్నకుండిపోతున్నారు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు. దీంతో తమను అడ్డుకునే వారే లేరు అంటూ మైనర్ యువకులు వాహనాలతో పట్టణంలో హల్చల్ చేస్తున్నారు.



వాహనాలు నడుపుతున్న చిన్నారులు

అవగాహన కార్యక్రమాలు అంతంత మాత్రమే..

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలు అంటూ ఏడాదికి ఒకసారి అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఇలా కాకుండా సాధారణ రోజుల్లోనూ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతా నియమాలు, నిబంధనలు, ప్రమాదాలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇకనైనా పోలీసు రవాణా శాఖ అధికారులు స్పందించి వాహనాలు నడిపే మైనర్లను గుర్తించి వారితోపాటు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

శింగరాయకొండ మండలంలో ఇనాం భూముల సమస్య పరిష్కారం చేసి రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు లేకుండా చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆదివారం శింగరాయకొండలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు టంగుటూరి రాము మాట్లాడుతూ శింగరాయకొండ మండలంలో ఇనామ్ భూముల సమస్య వల్ల దేవాదాయ శాఖ రిజిస్ట్రేషన్ కాకుండా నిలుపుదల చేయటం వల్ల ఎంతోమంది ప్రజలు సోమరాజుపల్లి, శింగరాయకొండ, పాత శింగరాయకొండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇక్కడ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా శింగరాయకొండ పట్టణంలో ఉన్న అయితే రామయ్య శెట్టి సత్రం సమస్య కూడా పరిష్కారం చేయాలని కోరారు. పిబి ఛానల్ కాలువకు చిల్లచెట్లు తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. మన్నేరు నదిపై చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టడం ద్వారా తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టి.రామ్మూర్తి, సీపీఎం వార్డు సభ్యులు పడిదపు రవికుమార్, పేముల బాబురావు, కె.రామకష్ణ, నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి కృషి

టంగుటూరు: టంగుటూరు మండలంలోని ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి కృషి చేస్తానని సంఘం నూతన అధ్యక్షుడు చుండి రమేష్ బాబు అన్నారు. టంగుటూరు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం టంగుటూరులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చుండి రమేష్ బాబు మాట్లాడుతూ అందరూ తప్పని సరిగా పోస్టల్ బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా చుండి రమేష్ బాబు, అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా షేక్ అమీర్ బాషా, సెక్రెటరీగా కిరణ్, జాయింట్ సెక్రెటరీగా కోటేశ్వరరావు, సభ్యులు నాగరాజు, సుబ్బారావు, ఇతర కార్యవర్గ సభ్యులు 15 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

జనసేన కొండపి ఇన్‌ఛార్జిని మార్చాలి

శింగరాయకొండ: జనసేన కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కనపర్తి మనోజ్ కుమార్‌ను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో జనసేన నాయకుడు పెద్దిశెట్టి మనోజ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జనసేన పార్టీలో మంచి యువనాయకత్వం ఉందన్నారు. జనసేన పట్ల విశ్వాసం, విధేయత, చిత్తశుద్ధి కలిగిన కార్యకర్తలు తగ్గిపోవడం ఏమాత్రం పార్టీకి క్షేమం కాదన్నారు. అధిష్టానం వాస్తవ పరిస్థితులను గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గోరంట్ల కళ్యాణ్, సయ్యద్ జాన్ బాషా, జోగేంద్ర హరికష్ణ, రామకోటయ్య, ఊళ్ళపాలెం వెంకటేశ్వరరావు, బుజ్జి, మేకల సాయి పాల్గొన్నారు.

బైక్ తగిలి బాలుడు మృతి

డాక్టర్ అందుబాటులో లేక సకాలంలో అందని వైద్యం

ప్రజాశక్తి - గిద్దలూరు



మృతి చెందిన నిరంజన్ రెడ్డి

ద్విచక్ర వాహనం తగిలి బాలుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో చోటు చేసుకుంది. బంధువులు అందించిన సమాచారం మేరకు.. జంగం నిరంజన్ రెడ్డి(7) అనే బాలుడు ఆదివారం కావడంతో తన తండ్రి మాధవ రెడ్డితో పట్టణంలోని ఆదర్శ బీఈడీ కాలేజీ సమీపంలోని తమ పొలానికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా రోడ్డుపై వస్తున్న ద్విచక్ర వాహనం తగలడంతో మొహంపై తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన నిరంజన్ రెడ్డిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ వైద్యులు లేకపోవడంతో నర్సులు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం సిబ్బంది సూచన మేరకు ప్రైవేట్ వైద్యశాలకు తరలిస్తుండగా బాలుడు మృతి చెందాడు.

ఏరియా వైద్యశాల వైద్యుల నిర్లక్ష్యం

పట్టణంలోని ఏరియా వైద్యశాల వైద్యుల నిర్లక్ష్యం దశాబ్దాలుగా ప్రజల ప్రాణాలకు శాపంగా మారింది. ఇక్కడి వైద్యులు తమ సొంత క్లినిక్‌లకు పరిమితమై ప్రజల ప్రాణాలు గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయానికి వైద్యులు అందుబాటులో ఉంటే మా బిడ్డ బ్రతికేవాడేమో కదా అని నిరంజన్ రెడ్డి బంధువులు విలపించారు. ఇప్పటికైనా ఈ వైద్యశాలపై జిల్లా ఉన్నత వైద్యాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

బాణసంచా విక్రయదారుడు అరెస్ట్

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మార్కాపురం పట్టణ పరిధిలోని ఏకలవ్య కాలనీలో అక్రమంగా బాణాసంచాను నిల్వ ఉంచుకొని విక్రయిస్తున్నట్లు మార్కాపురం పట్టణ పోలీసులకు సమాచారం రావడంతో పట్టణ ఎస్సై ఎం సైదా బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. బాణాసంచా నిల్వ ఉన్న గోడౌన్‌పై దాడి చేసి మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని షాపు యజమాని అదుపులోకి తీసుకున్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

ట్రాఫిక్ పరిష్కారానికి సహకరించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోందని, చిరు వ్యాపారులు, వాహనదారులు సహకరించాలని మార్కాపురం డిఎస్‌పి యు.నాగరాజు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మార్కాపురం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కాలి నడకన డిఎస్‌పి నాగరాజుతో పాటు సిఐ పి.సుబ్బారావు, పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబులు పోలీసు సిబ్బందితో పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్యగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి పోలీసు స్టేషన్‌లో శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య ఆదివారం రికార్డులు తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలలో భాగంగా జరుగుమల్లి పోలీసు స్టేషనులో రికార్డులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

సిఐటియు ఆధ్వర్యంలో నిత్యవసరాలు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి

ప్రజాశక్తి - రేపల్లె

వరద బాధితులకు సిఐటియు ఆధ్వర్యంలో నిత్యవసరాలు, దుస్తులు ఆదివారం పంపిణీ చేశారు. వరద బాధితులకు జరిగిన అపారనష్టాన్ని పూడ్చటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ముందుకు రావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో వరద ముంపు పరిధిలోని పెనుమూడి, రేపల్లె రూరల్ మండలంంలో నష్టపోయిన అంగన్‌వాడి, ఆశ, అసంఘటిత రంగంలోని పెనుమూడి ముఠా కార్మికులు 40మందికి రూ.800 విలువైన నిత్యవసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఆడపిల్లలకు పంజాబీ డ్రెస్సులు అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ అధ్యక్షతన ఆమెతోపాటు సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహా రావు, మధ్యాహ్నభోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయ్యా రమాదేవి,108 మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు గీత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వరమ్మ, భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె ధర్మరాజు పంపిణీ చేశారు. కృష్ణానది తీర ప్రాంతంలో రేపల్లె మండలం పెనుమూడి వద్ద నుండి కొల్లూరు, భట్టిపోలు లంక గ్రామాల్లో వివిధ పథకాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఇతర అనేక మంది అసంఘటిత రంగంలోని భవన నిర్మాణం, ముఠా కార్మికులు సర్వం కోల్పోయారని అన్నారు. సిఐటియు కార్మికులకు అన్ని సందర్భాల్లో అండగా ఉంటుందని అన్నారు. 500 కార్మిక కుటుంబాలకు నిత్యవసరాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ కేంద్రంగా సిఐటియు అన్నదానం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణానది లంక గ్రామాల్లో సర్వం కోల్పోయిన కార్మికులు, ప్రజలందరినీ ఆదుకోవటానికి అన్ని రకాలుగా ముందుకు రావాలని కోరారు. కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కారం కోసం వివిధ దశల్లో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎన్ కృష్ణకుమారి, కె ఆశీర్వాదం, కె గోపి, వి మావో, ఎన్ రామారావు, కె రమేష్, కె ఆశీర్వాదం పాల్గొన్నారు.

కొల్లూరు : కృష్ణా నది వరద ముంపు పరిధిలోని లంక గ్రామాల అంగన్‌వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం యానిమేటర్స్, పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.800 విలువ చేసే నిత్యవసర వస్తువులను 200మందికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి, సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, మధ్యాహ్నం భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయ్య రమాదేవి, 108 మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు గీత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె ధనలక్ష్మి మాట్లాడుతూ కృష్ణ నది తీర ప్రాంతంలోని కొల్లూరు లంక గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఇతర అనేక మంది అసంఘటిత రంగం భవన నిర్మాణం, ముఠా కార్మికులు వరదల వల్ల సర్వం కోల్పోయారు. వారికి బాధ్యత కలిగిన సిఐటియు కార్మికులకు అన్ని సందర్భాల్లోనూ అండగా ఉంటుందని అన్నారు. ఆ నేపథ్యంలోనే జిల్లా పరిధిలోని 200 కార్మిక కుటుంబాలకు నిత్యవసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నష్టపోయిన కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో అంద జేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తోకలవారిపాలెం సర్పంచి టి కృష్ణమోహన్, బి అగస్టీన్, టి సురేష్, జి సుధాకర్, బి సుబ్బారావు, పి నాగమల్లేశ్వరరావు, కృపానందం, దివ్య పాల్గొన్నారు.



సిఐటియు ఆధ్వర్యంలో కొల్లూరులో సరుకుల పంపిణీ చేస్తున్న మజుందార్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - చీరాల

ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ డాక్టర్ చుండూరి నాగేశ్వరావు, లలిత దంపతుల సహకారంతో ఆదివారం నిర్వహించిన శిబిరంలో 430మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 96మందికి కంటి ఆపరేషన్లు అవసరని గుర్తించారు. శంకర్ నేత్రాలయం నుంచి ప్రత్యేక వైద్య బృందం వచ్చి కంటి నరములు, రెటీనా పరీక్షలతో పాటు షుగర్, బిపి పరీక్షలు చేశారు. తొలిత 30 మందిని ఆపరేషన్ల నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో ఆపరేషన్లు చేస్తామన్నారు. మూడేళ్లగా శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 400 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేశామని నిర్వాహకులు శ్రీరాం సురేష్ తెలిపారు. దాత ఎన్ఆర్ఐ నాగేశ్వరావు సహకారంతో ఉచితంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాం వేణుగోపాల్, రత్నాకర్, మంచికంటి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



స్కూల్ గేమ్స్‌లో కొండ మంజులూరు పాఠశాల విద్యార్థులు

సత్తా చాటిన కొండమంజులూరు విద్యార్థులు

ప్రజాశక్తి- పంగులూరు

సంతమాగులూరు మండలం ఏల్చూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో శనివారం జరిగిన అద్దంకి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీల్లో మండలంలోని కొండ మంజులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మండల స్థాయిలో 34 మంది విద్యార్థులు గెలుపొందగా, నియోజ వర్గ స్థాయిలో 16 మంది వివిధ పోటీల్లో గెలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఏల్చూరులో జరిగిన నియోజక వర్గ స్థాయి పోటీల్లో అందర్17 బాలుర వాలీబాల్ పోటీల్లో బి అక్షిత్, ఎస్ సూర్యతేజ, యు సందీప్, అండర్17 బాలికల విభాగంలో ఎ అవిలా, జి శ్రావణి, వి రమ్య, బి వైశాలి, అండర్ -17 కబాడీ బాలుర విభాగంలో ఎస్ రవికుమార్, ఎస్ లక్ష్మణకుమార్, అందర్17 కబడి బాలికల విభాగంలో పి కార్తీక, కె మనస్విని, అండర్17 ఖో ఖో భాగంలో వై సంధ్యారాణి, అండర్ -14 కబడ్డీ బాలికల విభాగంలో బి మానస, పి జోష్న, అండర్- 14 చెస్ భాగంలో కె జాకబ్ జపనీ శాస్త్రి, అండర్-17 చెస్ విభాగంలో కె జాన్ బాబు విజయం సాధించి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఇమ్మడిశెట్టి అనిత, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక పశువైద్య ఉపసంచాలకులు రమేష్ బాబు ప్రారంభించారు. గంగవరం పశువైద్యశాల వద్ద 173 పశువులకు వైద్య సేవలు అందించారు. పశుపోషకులకు ఆ గేదెలకు సంబంధించిన మందులు అందించారు. కార్యక్రమంలో సత్య సాయి సేవ మండలి సభ్యులు, గంగవరం పశు వైద్య సహాయకులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరి ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన


- రమేష్ హాస్పటల్, నోవా అగ్రి గ్రూప్, ఏలూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- వైద్య శిబిరంలో 1353 మందికి వైద్య పరీక్షలు



ఎన్‌టిఆర్, నాగేశ్వరావు చిత్రపటాలకు దండలు వేసి శిభిరం ప్రారంభిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని స్వర్ణ గ్రామంలో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సహకారంతో నోవా ఆగ్రీ గ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో సాయంత్రం4 గంటల వరకు వైద్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో శిబిరం క్యాంప్ కిక్కిరిసింది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పురుషులు, మహిళలకు వేరువేరుగా ఓపీలు, బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజా సేవే లక్ష్యంగా దశాబ్ద కాలంగా నిరంతరం సేవలు ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు కొనసాగిస్తున్నారని జనసేన ఇన్చార్జి పెద్దపూడి విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వేలాది మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించి కంటి వెలుగు ప్రధాతగా నిలిచారన్నారు. ప్రజలకు సేవ చేయడం బాధ్యతగా తీసుకొని సేవలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి నాయకుడు ఉండడం ప్రజలందరి అదృష్టం అన్నారు. లక్షల మందికి సేవ చేయడం ఆయనకు దేవుడు ఇచ్చిన వరం అన్నారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, బర్డ్ హాస్పిటల్ మాజీ సంచాలకులు డాక్టర్ భరత్ చంద్ర, స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ నెలకుదిటి అనిత, సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ రామారావు, మెదడు, నరముల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ అరుణ్, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ బాల భాస్కర్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ బడిపాటి రాజు, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణురాలు డాక్టర్ శుభ కట్టా, డాక్టర్ భరత్ వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుమల శెట్టి శ్రీహరి, కాసిం, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పొద వీరయ్య చౌదరి, చిన్న నారాయణ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకరశెట్టి చిరంజీవి, మండల అధ్యక్షుడు సాగిరి శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు బలరాం, వెంకటస్వామి, సురేంద్రబాబు, సుబ్బారావు, ఆదినారాయణ, రాజు, శ్రీనివాసరావు, రామ్మోహన్, శేషయ్య, బంగారు బాబు, సుబ్బరాయుడు, నాగరాజు, ప్రహ్లాదు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామారావు

ప్రజలకు కనువిందు చేసిన ఇంద్రధనస్సు

ప్రకాశక్తి - చీరాల

పట్టణంలో రంగు రంగుల ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. ఆదివారం తెల్లవారు జామున సూర్యోదయంతో పాటు చీరాలలో వర్షం కురిసింది. వర్షం ఆగిన కొద్ది సేపటికే ఆకాశంలో ఇంద్రధనుస్సు పూర్తిగా ఏర్పడింది. ఆకాశంలో ఏర్పడిన అద్భుతాన్ని ప్రజలు భవనాలు, అపార్టుమెంట్ల పైకి ఎక్కి ఆసక్తిగా వీక్షిస్తూ సెల్ఫీలు తీసుకున్నారు. ఇంద్ర ధనస్సును చూడటం ఇదే మొదటిసారని కొంత మంది యువత ఆనందన్ని తోటి స్నేహితులతో పంచుకున్నారు.



కనువిందు చేస్తున్న ఇంద్ర ధనుస్సు

వీధిలైట్లు సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని వైకుంటపురం, శ్రీరామ్ నగర్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు కోరారు. సిపిఎం సమావేశం ఎం తవిటి నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాబురావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు రోజు రోజుకీ పనులు తగ్గిపోతున్నాయని అన్నారు. పట్టణంలో ఉపాధి పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఎం వసంతరావు మాట్లాడుతూ వైకుంటపురం, జాలమ్మ గుడి రోడ్డు, ఇతర చోట్ల వీధి దీపాలు లేక దొంగలు బెడద పెరిగిందన్నారు. రాత్రిపూట ఆటోలో టైర్లు కోసేస్తున్నారని అన్నారు. దొంగలు బెడద నుంచి కాపాడాలి కోరారు. సిపిఎం శాఖ కార్యదర్శిగా గొర్ల శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల శేషయ్య, నాగమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్కాపురం మణిహారం 'శ్రీభ్రమర'

'శ్రీసిటీ' గ్రాండ్ ప్రీ లాంచ్ వేడుకలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంత మణిహారంగా శ్రీభ్రమర టౌన్‌షిప్స్ సారథ్యంలో 'శ్రీసిటీ' ఏర్పాటు కాబోతోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్' సారథ్యంలో మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీసిటీ గ్రాండ్ ప్రీ లాంచ్ వేడుక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి. అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యలు శ్రీసిటీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం అభివృద్ధి కాబోతోందన్నారు. త్వరలో మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమన్నారు. ఈ ప్రాంతంలో స్థలాలు, పొలాలు ఉన్న



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందుల

వారంతా బాగుపడే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. అభివృద్ధి చెందుతున్న వేళ శ్రీభ్రమర శ్రీసిటీ పేరుతో అతి పెద్ద టౌన్‌షిప్ నిర్మించేందుకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఇక్కడ మొదటి దశలో 85 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్, అందులో విల్లా ప్లాట్లు, కమర్షియల్ ప్లాట్లు, సింప్లెక్స్ హౌసెస్, డూప్లెక్స్ గృహాలు, విల్లాలు వంటివి నిర్మించేందుకు శ్రీసిటీని సిద్ధం చేయడం శుభపరిణామన్నారు. శ్రీభ్రమర పేరుతో ఇక్కడ ఏర్పాటవుతున్న శ్రీసిటీ నిబంధనల మేరకు రూపుదిద్దుకుంటోందన్నారు. శ్రీభ్రమర అధినేత గళ్లా రామచంద్రరావు మాట్లాడుతూ మార్కాపురం వాణిజ్య పట్టణంగా రాణిస్తోందన్నారు. భవిష్యను దృష్టిలో పెట్టుకుని 60 అడుగుల రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందులో పది రకాల పార్కులు ఉంటాయన్నారు. తాము రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రాజెక్టులు చేపట్టామన్నారు. మార్కాపురం ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో ఇక్కడ సువిశాలమైన ప్రదేశంలో శ్రీసిటీ నిర్మించబోతున్నట్లు చెప్పారు. తొలుత చిన్నారుల అద్భుత ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీభ్రమ ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి సాయిశంకర్, ఆ కంపెనీకి చెందిన పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

హాస్యం మానవ జీవితానికి టానిక్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

హాస్యం మానవ జీవితానికి టానిక్ లా పనిచేస్తుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు. నెల్లూరు టౌన్ హాలులో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు సాహిత్యంలో హాస్యం అన్న అంశంపై ఆయన ప్రసంగించారు. సభకు కష్ణాపట్నం ఎపి జెన్‌కో డిఎస్‌పి కొల్లూరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్, వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. చేతన కార్యదర్శి వై.శేషగిరీశమ్, కార్యవర్గ సభ్యుడు, వీ.ఆర్. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం నిర్వహణలో నిర్వహించిన



సన్మానం అందుకుంటున్న పొన్నూరు వేంకట శ్రీనివాసులు

కార్యక్రమంలో వక్తలు పొన్నూరు వేంకట శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్య నాయుడు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎ. జయప్రకాష్, బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి, కవి రాచపాలెం రఘు, వై.విశ్వనాథం, చేజర్ల వినయ, పి.వి. సుబ్రమణ్యం, బందావనరావు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

1న చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో అక్టోబర్1న జిల్లా వ్యాప్తంగా మండల, పట్టణ స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సిహెచ్. జయప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల స్థాయి పరీక్షలలో ప్రతి తరగతిలోనూ మొదటి స్థానం సాధించిన ముగ్గురు విద్యార్థులు ఆ పాఠశాల జట్టుగా అక్టోబర్ 1న నిర్వహిస్తున్న మండల, పట్టణ స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు పంపాలని కోరారు. జిల్లా స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు అక్టోబర్27న, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9,10 తేదీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మూఢనమ్మకాల పట్ల అవగాహన కల్పించి వాటిని నిర్మూలించేందుకు, సైన్స్‌పట్ల ఆసక్తిని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు , విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు జనవిజ్ఞాన వేదిక గత 36 సంవత్సరాలుగా కృషి చేస్తుందన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జెవివి చేస్తున్న కృషిలో భాగంగా నిర్వహిస్తున్న ఈ చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

ట్యాంకర్లు ఎవరి కోసమో..?

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పుష్కలంగా వర్షాలు కురిశాయి. భూగర్భ జలమట్టం పెరిగింది. బోర్లలోకి నీరు వచ్చింది. అయినప్పటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ ట్యాంకర్లు ఎవరి కోసం ఏర్పాటు చేశారు, ప్రభుత్వ ధనం ఎందుకు వృధా చేస్తున్నారని ప్రజలు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దోర్నాల పట్టణం, ఐనముక్కల, తిమ్మాపురం గ్రామాలకు ప్రతిరోజూ 50 ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే పరిస్థితి మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతుంది. గంటావానిపల్లి, గుడిపాడు గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరిగి నీరు పుష్కలంగా అందుతుంది. మరమ్మతులకు గురైన మోటార్లను బాగు చేయించి డీప్ బోర్లను వినియోగంలోకి తెస్తే ఆయా గ్రామాల నీటి సమస్య పరిష్కారం అవుతుంది. గ్రామ పంచాయతీ నిధులతో వీటికి మరమ్మతులు చేయించుకునే అవకాశం ఉంది. ఆ విధంగా ఆలోచించకుండా ఒక్కో ట్యాంకర్‌కు రూ. 550లు చొప్పున చెల్లిస్తూ ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అనవసరంగా ప్రభుత్వ ధనాన్ని ట్యాంకర్ల యజమానులకు కట్టబెడుతున్నారు.

ట్యాంకర్ల దగ్గర పట్టుకోలేకపోతున్నాం..

బోర్లలో నీటి మట్టం పెరిగింది. కొద్దిపాటి మరమ్మతులు చేస్తే పుష్కలంగా నీరు వస్తుంది. పైపులైన్ల ద్వారా తమ గడపల వద్ద గల కొళాయిల దగ్గరే నీరు పట్టుకునే అవకాశం ఉంది. అయితే ట్యాంకర్లను ఏర్పాటు చేసి తమను ఇబ్బందులు పెడుతున్నారని పెద్దదోర్నాలకు చెందిన కోటమ్మ తెలిపింది. ప్రతిరోజూ ట్యాంకర్ల ముందు గొడవ పడాల్సి వస్తుందని ఐనముక్కలకు చెందిన సునీత చెప్పింది. ట్యాంకర్ల కోసం కుటుంబానికి ఒక మనిషిని కేటాయించాల్సి వస్తుందని ఆమె వాపోయింది. పశువులు ఉన్న తమలాంటి వారికి ట్యాంకర్ల నీరు సరిపోవడం లేదని తిమ్మాపురానికి చెందిన అంజమ్మ తెలిపింది. డీప్ బోర్లకు మరమ్మతులు చేస్తే కావాల్సినంత నీరు లభిస్తుందన్నారు.



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

ఫోన్ ఎత్తరూ.. సమాధానం చెప్పరూ...

నీటి సమస్య గురించి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇకి సమాచారం చేప్పేందుకు ఫోన్ చేస్తే ఎత్తి సమాధానం చెప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ట్యాంకర్లను నాయకుల లబ్ధి కోసమే ఏర్పాటు చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ. 550 చొప్పున ప్రతిరోజూ మండలం మొత్తం మీద లక్షల రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏ బోరులో నీరు వస్తుంది, ఏ బోరులో రావడం లేదో పర్యవేక్షించాల్సిన ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అవన్ని పట్టించుకోకుండా ట్యాంకర్ల యజమానులలు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి ట్యాంకర్ల ఏర్పాటుకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని డీప్‌బోర్లలకు మరమ్మతులు చేయించి ట్యాంకర్ల ద్వారా నీటివ సరఫరాను నిలిపివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రశ్నాపత్రాల ఆవిష్కరణలో ఉపాధ్యాయులు, నాయకులు

ఎపి టెట్ మోడల్ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం

యుటిఎఫ్, డివైఎఫ్ఐ మార్కాపురం డివిజన్ ఆధ్వర్యంలో ంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపి టెట్ మోడల్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షలకు అభ్యర్థుల నుంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంఇఒలు బి.రాందాస్ నాయక్, టి.శ్రీనివాసులు మాట్లాడుతూ టెట్ ఎగ్జామ్‌కు ఎలా సిద్ధమవ్వాలో వివరించారు. సలహాలు సూచనలు చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఒద్దుల వీరారెడ్డి మాట్లాడుతూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని, మీరందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్, పెద్దారవీడు, మార్కాపూరం టౌన్ అండ్ రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాపయ్య, యల్లమందరెడ్డి, వంకేశ్వరం శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చలమారెడ్డి, అల్లూరి శ్రీనివాసులు, నాసరయ్య, చంద్రశేఖరయ్య, వెంకటరామిరెడ్డి, వి.రాజేష్, వీరభద్రారెడ్డి, మస్తాన్, శ్రీనివాసులు, సుబ్బారావు, రమణ, ఫణీంద్ర, శేష యోగయ్య, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు ఎస్.కె రసూల్, డివైఎఫ్ఐ నాయకులు కొండయ్య, జబ్బార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు గద్దలగుంటలోని రామాలయం వద్ద గద్దలగుంట విశ్రాంత మరియు ఎంప్లాయీస్ అసోసియేషన్ టీం (జిఆర్ఇఎటి) మరియు ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన గద్దలగుంట విశ్రాంత మరియు ఎంప్లాయీస్ అసియేషన్ టీం సభ్యులను అభినందించారు, శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రముఖ ఎముకలు మరియు కీళ్ళ వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకష్ణ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో శ్రీరామ్ హాస్పిటల్‌లోని పది విభాగాలకు చెందిన మల్టీ స్పెషాలిటీ వైద్య నిపుణులు వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. 350 మంది వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలు పొందినట్లు తెలిపారు. వైద్య శిబిరం బిపి, షుగర్, ఎముకల సాంద్రత పరీక్ష, హీమోగ్లోబిన్, థైరాయిడ్, ఇసిజి గుండె పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. వైద్యశిబిరంలో ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి, సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు మరియు ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ సానల ధీరజ్ బాబు, జనరల్ అండ్ ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ జరుషా జాస్మిన్, చెవి ,ముక్కు, గొంతు శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ నడికట్టు మౌనిక రెడ్డి, ఊపిరితిత్తులు మరియు శ్వాసకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కుమార్ వర్మ, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పసుపులేటి సుధీర్ , దంత వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ సరయు ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఏడుకొండలు , డాక్టర్ పల్లవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి నాయకులు

మహాధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చీరాల

బీసీ కుల గణన చేయాలని అక్టోబర్ 9న విజయవాడలో బిఎస్‌పి ఆధ్వర్యంలో జరుగనున్న మహా ధర్నా జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. స్థానిక గడియార స్థంభం కూడలిలోని పూలే విగ్రహం వద్ద ఆదివారం కరపత్రం ఆవిష్కరించారు. దేశంలో 60 శాతం కంటే ఎక్కువ ఉన్న బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కులగనణ జరిగితే దేశ రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని అన్నారు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో రాగానే బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారని, దానిని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు కాటి మార్క్, గొర్రెపాటి రవి కుమార్, దుడ్డు భాస్కరరావు, భగత్ సింగ్, బీసీ ఫెడరేషన్ నాయకులు వుంటుకూరి వెంకటేశ్వర్లు, కుంచాల పుల్లయ్య, వంశీ, బాజీ షరీఫ్, సుధాకర్, శ్రీను, జిలాని పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న తెలుగుదేశం నాయకులు

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రతి మనిషి కనీసం కొన్ని మొక్కలు నాటాలని తెలుగుదేశం సీనియర్ నాయకులు ఎంఆర్‌కె మూర్తి అన్నారు. చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఫుడ్ ఆఫీసర్ మొఖమాటం శ్రీనివాస రావు సహకారంతో గ్రామంలో ఆదివారం 250కిపైగా మొక్కలు హిందూ స్మశాన వాటిక, చెన్నకేశవ స్వామి నగర్, చెరువు ఏరియాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమం లో తెలుగుదేశం అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు దివి రాంబాబు, కందుల వెంకటేశ్వర రావు, దివి శ్రీనివాసరావు, నాగుల పున్నారావు, విస్సంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎస్ఐ శివయ్య

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆటో డ్రైవర్లు నిబంధనలను అతిక్రమించి అధికలోడుతో ప్రయాణికులను ఎక్కించుకొని తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం శివయ్య హెచ్చరించారు. మండలంలోని వెల్లటూరులో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేశారు. ఆటోలో నిబంధనకు మించి ప్రయాణిస్తే అనేక విధాలుగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆటోలతో పాటు ఇతర వాహనాలు నిబంధనలకు మించి అధిక లోడుతో సరుకులు తరలిస్తే సీజ్ చేయనున్నట్లు తెలిపారు. సురక్షిత ప్రయాణాన్ని ఎన్నుకోవాలని సూచించారు. కోరి ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితికి గురికారాదని అవగాహన కల్పించారు.

లంక గ్రామాల్లో నిత్యవసర సరుకులు పంపిణీ


వరద బాధితులకు సరుకులు అందజేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదలంక పంచాయతీలో ఇటీవల కృష్ణానది ముంపు గురైన 300 మందికి వివిధ రంగాల్లో పనిచేస్తున్న పెదలంక గ్రామానికి చెందిన ఉద్యోగుల సహకారంతో ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన నిత్యవసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ తమ మిత్రుల సహకారంతో ఆపదలో ఉన్నవారికి ఎప్పుడు సహకారం అందిస్తామని తెలిపారు. తమ వంతుగా తమ గ్రామానికి సేవ చేయాలనే దృకృథంతో తమ పక్కనున్న గ్రామాల్లో కూడా గతంలో అనేక సేవలు చేశామని తెలిపారు. కరోనా సమయంలో అనేక సేవ కార్యక్రమాలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో నాగేంద్రం, గురవయ్య, రాం కుమార్, ప్రసాద్, కిరణ్, మనోజ్, భవ్య పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని రావిలంక గ్రామంలో వరద ముంపుకు గురైన కుటుంబాలకు ఎన్ఆర్ఐ దేవరపల్లి అగ్గి రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.వెయ్యి విలువచేసే నిత్యవసర సరుకులు మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ ఆధ్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవపాల్ మాట్లాడుతూ వరద బాధితులకు సహాయం చేసిన అగ్గి రామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికీ కొన్ని రూ.లక్షలు వరద బాధితులకు సహాయం చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి సహాయం చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తోకలవానిపాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్, మేడ్ నాయకులు గొడుగు సూరిబాబు, సౌపాటి కిషోర్ బాబు, రావిల నల్లయ్య, కట్టెపోగు పున్నారావు, సుమంత్, పంతగాని నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ఇటీవల కురిసిన వర్షాలకు కాశి రైస్ మిల్లు వద్ద ముంపునకు గురైన ఎస్టి వాసులకు ఆదివారం నిత్యవసరాలు పంపిణీ చేశారు. బియ్యం, నూనె, కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఎంఆర్‌కె మూర్తి, నాగుల పున్నారావు, సొంటి సుబ్బయ్య, ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, కొఠారి వరప్రసాద్, మొగిలిపువ్వు లక్ష్మణ్, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.


కొల్లూరు మండలం రావిలంకలో నిత్యవసరాలు పంపిణీ


చెరుకుపల్లిలో సరుకులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

నియోజకవర్గంలోని మేజర్, మైనర్ పంచాయితీల్లో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్త డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉంది. అయితే ఆయా గ్రామాల్లో రోడ్లవెంబడి చెత్త పేరుకుపోయి దర్శనం ఇస్తుంది. దుర్గంధం వెదజల్లుతూ ఉంది. ట్రాక్టర్లతో, బండ్లతో సేకరించిన చెత్త రోడ్ల వెంబడి కుప్పలు వేసి పంచాయితీ పారిశుధ్య కార్మికులు నిప్పు పెడుతున్నారు. ఆ నిప్పుతో వాసన వెదజల్లుతూ పొగ కమ్ముతుంది. ఆ రోడ్లలో వెళ్లే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వంలో చెత్త నుండి సంపద సృష్టించే ప్రక్రియలు గ్రామాల్లో మొదలు పెట్టారు. పంచాయితీలు చెత్తసేకరణ, ఎరువుల తయారీ కేంద్రాలు నిర్మించారు. ఆ తర్వాత అధికారానికి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని మూలన పడవేసింది. అవి నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. చెత్తను సంపదగా ఎప్పుడు మారుస్తారో అర్ధం కావడం లేదు.

ఇంకొల్లులో పేరుకుపోయిన చెత్త

మేజర్ పంచాయితీ ఇంకొల్లులో నిత్యం పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించి కడవకుదురు, గంగవరం రోడ్ల వెంబడి చెత్త సంపద కేంద్రంగా ఏర్పాటు చేసిన షెడ్డుకు, పావులూరు రోడ్డులో ఆర్టీసీ డిపో ఖాళీ స్థలం ఎదురు, పర్చూరు రోడ్డు, గొల్లపాలెం రోడ్డులోనూ చెత్త వేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పంచాయతీ చెత్తతో పాటు, చికెన్, మటన్ దుకాణాలు వ్యర్థాలు, చేపల కేంద్రాలతో పాటు కొబ్బరి బొండాల వ్యర్థాలు వేస్తున్నారు. గ్రామంలో ఏ రోడ్డు వెంబడికి వెళ్లిన కుళ్ళిపోయి దుర్గంధం వస్తుంది.


గంగవరం రోడ్లో పేరుకుపోయిన చెత్త

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

2014లో టిడిపి ప్రభుత్వం చత్తను సంపదగా మార్చుటకు ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలకు సంబంధించిన భవనాలు, షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం ఆ చెత్తను సంపదగా మార్చే ప్రయత్నంగాని, షెడ్లను వినియోగించుకునే ప్రయత్నం కానీ చేయలేదు. ప్రజల సొమ్ముతో కష్టపడి కట్టిన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

చెత్త సంపదగా మారేది ఎప్పుడు?

ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి మళ్ళీ వచ్చింది. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత చత్తను సంపదగా మారుస్తామని ప్రకటిస్తున్నారు. కానీ నేటికీ దానిపై దృష్టి సారించలేదు. వైసిపి ప్రభుత్వంలో మాదిరిగనే రోడ్ల వెంబడే పంచాయితీలో సేకరించిన చెత్త దర్శనమిస్తుంది. చెత్తను సంపద కేంద్రలకు తరలించి, వాటిని కంపోస్ట్ ఎరువుగా మార్చి రైతుల వినియోగం కోసం అందించేది ఎప్పుడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెత్తను సంపదగా మార్చే ప్రక్రియ ఎన్నాళ్ళకి చేపడుతారో అధికారులే చెప్పాల్సి ఉంది.

పార్కులో చిన్నారుల సందడి

- ఆహ్లాదకరంగా మున్సిపల్ పార్క్
- చిన్నపిల్లలతో పండుగ వాతావరణం
- నూతన అట వస్తువులతో చిన్నారుల కేరింతలు
- చిన్నపిల్లలతో పాటు తల్లిదండ్రులకూ ఆటవిడుపు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని మున్సిపల్ పార్కు చిన్నపిల్లల ఆట వస్తువులతో ఎంతో ఆహ్లాదకరంగా మారింది. దింతో ఆదివారం రాగానే చుట్టుపక్క ప్రాంత పిల్లలు వారి తల్లిదండ్రులతో పార్కుకు చేరుకొని ఆట వస్తువులతో ఆడుకుంటూ ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్కు కావటంతో చిన్నారులకు ఆట వస్తువులన్నీ ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. దీంతో వాటిని వినియోగిస్తూ ఎంతో ఆనందంగా కేరింతలు కొడుతూ సందడి చేస్తున్నారు. ఇటీవల నూతనంగా వాటర్ బోటింగ్నుగును అధికారులు ఏర్పాటు చేశారు. సాధారణంగా ఎగ్జిబిషన్లో కనిపించే వాటర్ బోటింగు రూ.100 వెచ్చించి చిన్నపిల్లలను తల్లిదండ్రులు ఎక్కిస్తుంటారు. ఇక్కడి పార్కులో ఉచితంగా అందుబాటులో ఉండటంతో తల్లిదండ్రులకు భారం లేకుండా చిన్నారులు సరదాగా బోటింగ్ చేస్తూ సంతోషంగా ఆడుకుంటున్నారు. మ్యూజికల్ డాన్స్, ఉయ్యాల్లో, రాట్నంలు, స్నోప్ డ్రాగన్, గుర్రం బొమ్మలు, వీల్స్, జారుడు బల్లలు, పలు రకాల ఆట వస్తువులతో చిన్నారులు ఆడుకుంటున్నారు. ఆ వెంటనే తినుబండారాలు కూడా అన్ని రకాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆదివారం మాత్రమే కాకా దసరా సెలవు దినాల కోసం చిన్నారులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు పిల్లలను ఆడిస్తూ వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలపై సేద తీరుతు చిన్నారులను ఆడించి ఇంటికి తీసుకువెళుతున్నారు.


బోటింగ్ చేస్తున్న చిన్నారులు


వాల్ మౌంట్ ఎక్కుతున్న చిన్నారులు


పిల్లలను ఉయ్యాల ఊపుతున్న తల్లిదండ్రులు


డైనోసార్ బొమ్మలతో ఆడుకుంటున్న చిన్నారులు

నూజెల్లపల్లిలో విద్యాభివృద్ధికి 'మద్దినేని' శోభ


డిఇఒకు అర్జీ ఇస్తున్న ఎస్ఎంసి చైర్మన్ మద్దినేని శోభ

ప్రజాశక్తి - పంగులూరు

'అందరూ చదవాలి – అందరూ ఎదగాలి. అందరూ చదువుకుంటేనే కదా సమాజం అభివృద్ధి చెందేది' అంటూ మండలంలోని నూజెళ్ళపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మద్దినేని శోభ గ్రామంలో పేద, గొప్ప తేడా లేకుండా విద్యార్థులంతా చక్కగా చదువుకునేందుకు, వారి భవిష్యత్తును వారే తీర్చి దిద్దుకునేందుకు కావలసిన అవకాశాలను కల్పించడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ విద్య, అందుకు కావలసిన అవకాశాలు అనే అంశంపై మద్దినేని శోభ 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ప్రభుత్వం విద్య కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతుందని అన్నారు. అయితే మనమంతా పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వదులుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తే విద్యార్థులు అని రంగాల్లో ముందుకెళతారని చెప్పారు. ఇందుకోసం తన పిల్లలను ఒకరిని నూజెళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు, ఒకరిని నూజెళ్ళపల్లిలోని అంగన్‌వాడి పాఠశాలకు పంపుతున్నట్లు తెలిపారు.


చైర్మన్ మద్దినేని శోభ

తనకు మొదటి నుండి చదువు అంటే ఎంతో ఇష్టమని అన్నారు. చదువుకోవడం ద్వారానే సమాజంను అర్థం చేసుకోవచ్చని అన్నారు. మన చుట్టూ ఉన్నవారికి చేయూత ఇవ్వొచ్చని చెప్పారు. అందుకోసమే తాను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కావాలనుకున్నట్లు చెప్పారు. తమ మద్దినేని కుటుంబం మొదటి నుండి గ్రామంలో విద్య అభివృద్ధికి కృషి చేసింది అన్నారు. తాత మద్దిలేని గురుస్వామి గ్రామంలో మొట్ట మొదటిసారిగా పాఠశాల నిర్మించాడని చెప్పారు. తరువాత ఆ పాఠశాలకు కావలసిన అన్ని హంగులు గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేశాడని చెప్పారు. మంచినీటి బావి, గేటు, దిమ్మెలు, బొమ్మలు, అన్ని మద్దినేని కుటుంబ సభ్యు లు ఏర్పాటు చేసిన వని చెప్పారు. పాఠశాలను అభివృద్ధి చేయటంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఈ పాఠశాల్లో చదివిన అనేక మంది విద్యార్థులు మంచి స్థాయికి వెళ్లారని చెప్పారు. మళ్లీ ఈ పాఠశాలకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వర్క్ అడ్జస్ట్మెంట్‌లో భాగంగా పాఠశాల్లోని కొన్ని ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఇందుకోసం కలెక్టర్, డిఇఒను కలిసి ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేయకుండా అందుకు కావలసిన విద్యార్థుల సంఖ్యను పెంచుతామని వినతి పత్రం ఇచ్చామన్నారు. గ్రామస్తులు పాఠశాల పురోగతి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రస్తుతం పాఠశాల్లోని సిబ్బంది చక్కగా పనిచేస్తున్నారని, మంచి ఫలితాలు సాధించేందుకు వారు చేస్తున్న కృషిని అభినందిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం రోజున విద్యార్థి నీ, విద్యార్థులకు పాయసం చేసి వడ్డించినట్లు చెప్పారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలని, మంచి స్థాయికి వెళ్లాలని కోరారు. మద్దినేని కృష్ణ చైతన్య, మద్దినేని శ్రీనివాస రావు, గ్రామస్థుల సహకారంతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.


విద్యార్థులకు పాయసాన్ని వడ్డిస్తున్న చైర్మన్ శోభ


కోనేటిపురం గ్రామంలో రేపల్లె వెళ్లే రోడ్డు దుస్థితి

అధ్వానంగా రేపల్లె రహదారి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు నుండి రేపల్లె వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా అద్వాన స్థితికి చేరింది. ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగల్ రహదారిగా ఉన్న ఈ మార్గంలో సుమారు 10గ్రామాలకు పైగా ఉన్నాయి. పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా సింగల్ రహదారి కావటమే కాక రోడ్డు సరిగా లేక పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి వర్షాకాలంలో పూర్తిగా వర్షపు నీటితో నిండిపోతుంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పుకునేందుకు అవకాశం లేక వాహన దారులు నానా అవస్థలు పడుతున్నారు. కోనేటిపురంలో రహదారి పూర్తిగా చిత్రమైంది. వర్షపు నీరు నిలబడి ప్రయాణికులకు ప్రాణ సంకటకంగా మారింది. ఈ ప్రాంతంలో మోకాటి లోతుపైగా గుంటలు ఏర్పడడంతో వర్షపు నీరు చెరువులను తలపిస్తున్నాయి. వాహనాలు ఏ విధంగా ప్రయాణించాలో తెలియని దుస్థితి నెలకొంది. ఆదమరిచి వాహనాలు నడిపితే గుంతలో జారిపడి ప్రమాదానికి గురైన సంఘటనలు నిత్యం ఈ ప్రాంతంలో జరుగుతూనే ఉన్నాయి. మీరు ఆ మార్గంలో అక్కడక్కడ కల్వర్టులు ఉన్న ప్రాంతంలో రహదారి ప్రక్కన గుంటలు పడి ప్రమాదపరితంగా మారాయి. భట్టిప్రోలు నుండి రేపల్లె వెళ్లే మార్గంలోని గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. భట్టిప్రోలు నుండి పేటేరు వరకు ఈ రహదారినే వినియోగించుకోవాల్సి ఉంది. రహదారి మార్జిన్లతో సహా బాగుంటే భట్టిప్రోలు నుండి రేపల్లె వెళ్లడానికి 15 నుండి 20 నిమిషాల సమయం పడుతుంది. కానీ ప్రస్తుతం దెబ్బతిన్న మార్గంలో దాదాపు 40 నుండి 60 నిమిషాల సమయం పడుతుందని ప్రయాణికుల వాపోతున్నారు. గర్భిణీలు, బాలింతలు వైద్యశాలకు వెళ్లడానికి ఈ రహదారి మార్గంలో నానా నరకయాతన ఎదుర్కోనల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అద్వాన స్థితికి చేరి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిన రహదారిని అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి అభివృద్ధి పర్చాలని కోరుచున్నారు. కోనేటిపురం గ్రామంలో నెలకొన్న రహదారి దుస్థితి దృష్ట్యా ఆర్ అండ్ బి అధికారులు, కనీసం పంచాయతీ అధికారులైన ఈ గుంటను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుచున్నారు.

లాపతా లేడీస్ ఆస్కార్‌కు ఎంపిక

మా వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్ రాజా హర్షం


మాట్లాడుతున్న దర్శకుడు దిలీప్ రాజా

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఆస్కార్ అవార్డు కోసం భారతదేశం తరపున హిందీ సినిమా లాపతా లేడీస్ ఎంపిక కావడం అభినందనీయమని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ దర్శకులు దిలీప్ రాజా అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లాపతా లేడీస్ సినిమా ఆస్కార్ అవార్డు కోసం ఎన్నో ప్రముఖ చిత్రాలను దాటుకొని భారతదేశం తరపున ఎంపీక కావడం శుభ పరిణామం అన్నారు. సినిమాను నిర్మించిన అమీర్ ఖాన్, దర్శకులను అభినందించారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశ సినిమా రంగం వైపు నేడు చూస్తున్నాయని అన్నారు. దీనికి కారణం ప్రపంచ స్థాయి విలువలతో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సినిమాలు తీసే స్థాయికి భారతదేశ చలనచిత్ర రంగం అభివృద్ధి చెందిందని అన్నారు. ఓటిటి విభాగాల్లో ప్రత్యేకంగా అందజేస్తున్న నెక్సాన్ అవార్డుల్లో బెస్ట్ డాక్యుమెంటరీగా ఆహా గోదారి ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ప్రముఖ హీరోయిన్ ప్రియమణి ఓటిటి సిరీసుల్లో నటించిన భామా కలాపం ఉత్తమ సీరిస్‌గా ఎంపిక కావడం పట్ల అభినందించారు. పెనుమూడి, నిజంపట్నం పోర్టుల్లో సినిమాలకు మౌలిక వసతులు, సహకారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రసిద్ధమైన పెనుమూడి రేవు వద్ద కనీస సదుపాయాలు కల్పిస్తే సినిమాలు తీయడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఈ మేరకు స్థానిక మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లుగా తెలిపారు. సినిమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రిని కలవాలని, సాధ్యమైనంత మేరకు సినిమాల నిర్మాణానికి సహకారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో కాకపోయినా కొంతమేరకు సినిమా రంగం రాష్ట్రానికి తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ సహకారం అందజేయాలని కోరారు. దర్శకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

పెనుమూడి వారధి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- ఆరుగురికి తీవ్ర, ఇద్దరికీ స్వల్ప గాయాలు
- చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


పెనుమూడి వారధి వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

ప్రజాశక్తి - రేపల్లె

రేపల్లె నుండి మచిలీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సును అవనిగడ్డ వైపు నుండి రేపల్లె వస్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం పెనుమూడి వారధి వద్ద ఆదివారం రాత్రి ఢీ కొట్టింది. ప్రమా దంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఆరుగు రికి తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయ పడినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మచిలీపట్నం సముద్ర స్థానానికి వెళ్లి వస్తున్న వాహనం అతివే గంగా రావడం ప్రమాదాన్ని కారణమని తెలిపారు. అశోక్ లేలాండ్ వాహనంలో ఉన్న పదిమందిలో ఇద్దరు మరణించారు. మిగిలిన వాళ్లు తీవ్ర గాయాలకు లోనై రేపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి కొందరు, అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో వారధి వద్ద తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రేపల్లె వైపు, వారధికి మరోవైపు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. వారధిపై జరిగిన ప్రమా దంతో ఆ ప్రాంతమంతా క్షతగాత్రుల ఆహాకారాలు, మృతు ల కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉన్నారు. మృతులు మండలంలోని చిన్న అరవపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ప్రమాదం గురించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని రేపల్లె డిఎస్పి మురళీకృష్ణ, సిఐలు మల్లికార్జున రావు, సురేష్ బాబు బాధితులను పరామర్శించారు. జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మాతంగి గంగాధర్, చెరుకూరి శ్యామ్ మృతికి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ సంతాపం తెలిపారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి జగదీష్‌నాయక్

గేదెల దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - మేదరమెట్ల

బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో గేదెల దొంగతనం చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు చీరాల డిఎస్పి పి జగదీష్ నాయక్ తెలిపారు. కొరిశపాడు పోలీసు స్టేషన్లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొరిశపాడు, మేదరమెట్ల, పంగులూరు ఎస్ఐలు వై సురేష్, ఎస్‌కె రఫీ, వినోద్ కుమార్ పర్యవేక్షణలో గేదెలను దొంగతనం చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు కొరిసపాడు మండలం పిచ్చుకల గుడిపాడు గ్రామంలోని ఎన్ఎస్పి కెనాల్ వద్ద అనుమానంగా తిరుగుతున్న మేదరమెట్లకు చెందిన రేగుల నాగర్జున, తమ్మవరంకు చెందిన బట్టు గురుస్వామిని పట్టుకొని విచారించినట్లు తెలిపారు. విచారణలో గేదెలను దొంగతనం చేస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. బాపట్ల, ప్రకాశం జిల్లాలోని నాగులుప్పలపాడు, మద్దిపాడు, ముండ్లమూరు మండలాల్లో కూడా దొంగతనాలు చేసి 17 గేదెలు, రెండు దూడలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఆ గేదెల విలువ రూ.5లక్షలు ఉంటుందని, వాటిని రికవరీ చేసినట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో గేదెలు దొంగతనం చేసి మిర్యాలగూడ సంతలో అమ్మకం జరిపినట్లు తెలిపారు. ఆ సొమ్మును వారి వద్ద రికవరీ చేసినట్లు తెలిపారు. ముద్దాయిలతో పాటు గేదెలను తోలుతున్న టాటా ఏసీ ఆటో, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలను సోమవారం రిమాండుకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ దొంగల ముఠాను పట్టుకోవడంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.


సృజన ఆధ్వర్యంలో రచయితలకు సన్మానం

రచయితలకు సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సృజన సాహిత్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహాభారతం ప్రాముఖ్యతను వివరించారు. సభకు కేశవమఠం అనిల్ కుమార సూరి అధ్యక్షత వహించగా షేక్ మస్తాన్ ప్రధానోపన్యాసం చేశారు. సభానంతరం సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్తు జ్యోతిష్మతి దంపతులకు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులకు సృజన, రోటరీ, అద్దంకిలోని సాహిత్య, సాంస్కృతిక, సంగీత వాద్య కళాకారుల సంస్థలన్నీ ఘనంగా ఆత్మీయంగా సత్కరించారు. సంకాబాబు, మలాది శ్రీనివాస రావు అతిథులందరికీ చక్కని విందు భోజనం ఏర్పాటు చేశారు. వీరవల్లి సుబ్బారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గా గాయత్రి, అన్నమనేని వెంకటరావు, చెన్నూపాటి రామాంజనేయులు, జ్యోతి చంద్రమౌళి, ఉబ్బా దేవపాలన, పంతంగి ఆంజనేయులు, కొల్లా భువనేశ్వరి, పసుమర్తి చిన కోటయ్య, రావూరి రంగయ్య, ఆర్‌వి రాఘవరావు, పసుపులేటి ఆంజనేయులు, టీచర్ పోలిరెడ్డి, డివిఎం సత్యనారాయణ, యనమండ్ర వరలక్ష్మి, షేక్ మహమ్మద్ రఫి, అనంతు నాగేశ్వరరావు, జాగార్లమూడి ప్రతాప్, మలాది శ్రీనివాస రావు, అద్దంకి లెవి ప్రసాద్, చిన్ని రమేష్, తమ్మన శ్రీనివాసరావు, ఇలపావులూరి శేష తల్ప శాయి, పసుమర్తి చిన కోటయ్య, సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఎస్‌పి ఎఆర్. దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సైబర్ నేరగాళ్ళ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి దామోదర్ తెలిపారు. ఒకరి బ్యాంకు ఖాతాను వేరేవాళ్లు నిర్వహించటం లేదా కమిషన్ తీసుకోని ఖాతాను అద్దెకు ఇవ్వడాన్ని మనీ మ్యుల్స్‌గా పిలుస్తారన్నారు. సైబర్ నేరగాళ్ళు, నిరక్షరాస్యులని , నిరుద్యోగులని, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకొని, వాళ్ళకి డబ్బు ఆశ చూపి వారితో ఖాతా తెరిపిస్తారన్నారు. ఆ ఖాతాను నేరం చేయటానికి ఉపయోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరగాళ్ళు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేయాలని ప్రజల వద్ద నుంచి డాక్యుమెంట్స్ సేకరించి , వాళ్ళకి తెలియకుండానే ఖాతాను తెరుస్తారన్నారు. డబ్బులు పోగొట్టుకున్న వాళ్ళు ,ఫిర్యాదు చేసినప్పుడు చాలా కేసుల్లో అమాయకుల ఖాతాలు, ఖాతాలు అద్దెకు ఇచ్చిన వాళ్ళు ఇరుక్కుంటున్నారన్నారు. వారి ఖాతాలు ఫ్రీజ్‌అవుతున్నాయని, కొన్నిసార్లు అరెస్ట్ అవుతున్నారన్నారు. మనీ మ్యుల్ స్కాం ఇరుక్కోకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలని ఎస్‌పి సూచించారు.



- మనీ మ్యూల్‌గా పనిచేయడం తీవ్రమైన నేరమని తెలిపారు. అది తెలిసి చేసినా, తెలియకుండా చేసిన నేరమే అని తెలిపారు.
- పార్ట్ టైం జాబ్ అని చెప్పి మీ ఖాతా వాడుకోవడానికి ఇస్తే ఎక్కువ డబ్బు ఇస్తామని ఎవరైనా సంప్రదిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు.
- తెలియని వారి నుంచి డబ్బు స్వీకరించడం లేదా ఫార్వార్డ్ చేయరాదని తెలిపారు.
- బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు డాక్యుమెంట్స్ , తెలియని వాళ్ళతో పంచుకోవద్దువని తెలిపారు.
- మనీమ్యుల్స్ గా ఉండరాదని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. ప్రకాశం పోలీసులు చెప్పే విషయాలను ఇంట్లో వారికి, స్నేహితులకు షేర్ చేసి సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎస్‌పి కోరారు.

దిగజారుతున్న మిర్చి ధరలు

క్వింటాకు రూ. రెండు వేలు తగ్గిన వైనం

ప్రజాశక్తి-పుల్లలచెరువు



మిర్చి ధరలు రోజురోజుకు దిగజారుతున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన మిర్చికి ధర వస్తుందనే ఆశతో రైతులు మిర్చిని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకున్నారు. అయిప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ధర పెరగకపోగా అంతకంతకూ తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పెట్టుబడులకు మిర్చి విక్రయించేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. సరైన ధర లేక ఆందోళన చెందుతున్నారు. శీతల గిడ్డంగుల అద్దెలు, ఇతర ఖర్చులకు అదనంగా చెల్లించాల్సి ఉండటంతో మరింత నష్ట పోతున్నారు. కల్లాల్లోనే అమ్మితే గిట్టుబాటు అయ్యేదని వాపోతున్నారు.

33 వేల ఎకరాల్లో...

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం, మండలాల్లో గత ఖరీఫ్‌లో 33 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. నర్సరీల్లో నారు కొనుగోలు చేసి నాటారు. ఎకరానికి రూ. లక్షన్నరకు పైగా పెట్టుబడి పెట్టారు. కొందరు రైతులు ఎకరాకు రూ. 25 వేల వరకు కౌలుకు వెచ్చించారు. పైర్లకు తెగుళ్లు ఆశించడం, అధిక వర్షాల వల్ల ఎకరానికి 15 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. సాధారణంగా ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. పైగా కోత కూలీ ఖర్చులు భారీగా పెరిగాయి. కల్లాల్లో పంట ఉండగా రకాలు, నాణ్యతకు అనుగుణంగా క్వింటా రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకు కొనుగోలు చేశారు.

ధర పెరుగుతుందనే ఆశతో..

ధర పెరుగుతుందనే ఆశతో చాలా మంది రైతులు గుంటూరులోని శీతల గిడ్డంగుల్లో సరుకు నిల్వ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పెట్టుబడుల సమయం కావడంతో మిర్చి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల వరదలు రావడంతో ధరలు ఒక్క సారిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం శీతల గిడ్డంగుల వద్ద క్వింటా మిర్చి రూ.13 వేలు నుంచి రూ. 16 వేలు వరకు మాత్రమే ధర పలుకుతుంది.

భారంగా పెరిగిన ఖర్చులు..

శీతల గిడ్డంగుల్లో మిర్చి టిక్కీలు నిల్వ చేసినందుకు క్వింటాకు రూ.450, రవాణా, కూలీల ఖర్చు, వడ్డీ కలిపితే క్వింటాకు మరో రూ.1500 వరకు అవుతుంది. ధర పెరగకపోవడం వల్ల అద్దెలు, ఇతర ఖర్చులు కలుపుకొని క్వింటాకు రూ.2 వేలు వరకూ నష్టపోతున్నామని రైతులు తెలిపారు. ప్రస్తుతం మిర్చి అమ్మినా గిట్టుబాటు రాదని, ధర పెరుగుతుందనే ఆశతో కొందరు ఉంచుతున్నారు. మరికొందరు రైతులు ఇంకా అప్పుల భారం పెరుగుతుందని భయంతో వచ్చిన ధరకే విక్రయిస్తున్నారు.

సమాజ సేవ ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



అవార్డులు అందుకుంటున్న సమాజ సేవకులు

సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యతని పలువురు వక్తలు పునరుద్ఘాటించారు. ఒంగోలు శ్రీ లాస్య ప్రియ పబ్లిక్ స్కూలులో జాతీ సేవా పురస్కార వేడుకలు ఆదివారం నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి జిఎస్ఆర్ చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఎల్‌సిఇఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పురస్కారాలను అందజేశారు. సామాజిక సేవా రంగంలో గ్రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షాలేమ్ రాజు హోప్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో ఎల్లప్పుడూ తాము ఉంటామని గ్రేస్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డాక్టర్ గడ్డం కష్ణయ్య అబ్దుల్ కలాం సేవ పురస్కారంతోపాటు ఢిల్లీ నేషనల్ కౌన్సిల్ ప్రతిష్టాత్మకమైన జాతీయ సేవ పురస్కారం అందుకున్నారు. డాక్టర్ మద్దాలి మాధవరావు ఫరెవర్ స్టార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ తో పాటు డాక్టర్ మధుర శ్రీ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ అందుకున్నారు. ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ సామాజిక సేవా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుని రాష్ట్రంలో వివిధ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న జిస్ఆర్ చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జడ సురేష్ బాబు డాక్టరేట్ అందుకున్నారు ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ సేవ చేయాలన్న సంకల్పం ఉంటే సరిపోదని అందుకు కఠినమైన దీక్ష అవసరమన్నారు. సమాజంలో ఎంతోమంది ట్రస్టులు పేరుతో సేవలు అందిస్తున్నారని, వారందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి పురస్కారాలు ఇస్తున్న ఘనత బుచ్చేశ్వరరావుకి దక్కిందన్నారు. సామాజిక రంగంలో జడ సురేష్ బాబు చేస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు న్యాయవాదిగా సమాజాభివద్ధిలో పాల్గొంటూ గౌరవ డాక్టరేట్ అందుకోవటం అభినందనీయమన్నారు. సందర్భంగా శ్రీ లాస్య ప్రియా పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాస ప్రసాద్, బంగారు పతక అవార్డు గ్రహీత చంద్ర. జుటూరి కష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- **బీచ్‌లకు త్వరలో బ్లూఫ్లాగ్ స్థాయి**
- **నిజాంపట్నం,వాడరేవుల్లో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం**
- **జిల్లా మత్స్య, పర్యాటకశాఖ అధికారి సురేష్**

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా



ముఖాముఖి

మత్స్యకారుల సంక్షేమం, పర్యాటకరంగ అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నట్లు జిల్లా మత్స్య, పర్యాటకశాఖ అధికారి పి. సురేష్ తెలిపారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారికి ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో 74 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉందన్నారు. 65 మత్స్యకార గ్రామాలు, అన్ని రకాల బోట్లు కలిపి 3,250 వరకూ ఉన్నట్లు తెలిపారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడం, మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి జిల్లా మత్స్య, పర్యాటకశాఖ అధికారి సురేష్ ప్రజాశక్తి ముఖాముఖి ద్వారా వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

బీచ్‌లకు త్వరలో బ్లూఫ్లాగ్ స్థాయి

బాపట్ల జిల్లాను పర్యాటకరంగ పరంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి జరుగుతుంది. 2024లో 'పర్యాటకం–శాంతి' అనే నినాదం, విజన్ బాపట్లలో బాగంగా జిల్లాలో పర్యాటక రంగానికి రూ.100 కోట్ల నిధులు రానున్నాయి. జిల్లాలోని బీచ్‌ల వద్ద పర్యాటకులు ఎక్కువ రోజులపాటు ఉండేలా అన్ని వనరులు సమకూరుస్తున్నారు. తీర ప్రాంతం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. బీచ్‌ల వద్ద గజ ఈతగాళ్లను నియమించారు. పర్యాటకులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా 100 మీటర్లకు ఓ గజ ఈతగాడు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

నిజాంపట్నం,వాడరేవుల్లో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం

నిజాంపట్నం, చీరాల వాడరేవులో రూ.902 కోట్ల అంచనాలతో రెండు ఫిషింగ్ హార్బర్లు మంజూరయ్యాయి. నిజాంపట్నంలో హార్బర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వాడరేవులో నీటిపై తేలియాడే విధానంలో నిర్మించే ఫ్లోటింగ్ జెట్టీ తరహా ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. ఫిషింగ్ హార్బర్‌లకు అనుబంధంగా ఒడ్డున చేపల వేలం కోసం ప్లాట్ ఫారాలు, ఐస్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజీ యూనిట్, సోలార్ వ్యవస్థ, ఆయిల్ బంకు, పడవల మరమ్మతుల కోసం పెద్ద షెడ్లు అందుబాటు లోకి వస్తాయి. నిజాంపట్నం దిండి వద్ద 193 ఎకరాల్లో ఆక్వా పార్కు నిర్మాణం కోసం రూ.187 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో కేంద్రప్రభుత్వం వాటాధనం రూ.112 కోట్లు. రాష్ట ప్రభుత్వం వాటా రూ 75 కోట్లు. ఇక్కడ పర్యాటకశాఖకు 50 ఎకరాలు కేటాయించారు.

మత్స్యకారులకు అండగా ఎఫ్‌ఎఫ్‌పిఒల ఏర్పాటు

జిల్లాలో మత్స్యకారులకు అండగా ఉంటూ మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందు కోసం ఫిష్ ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్స్ అసోషియేషన్లను (ఎఫ్‌ఎఫ్‌పిఒ) ఏర్పాటు చేశారు. కనీసం 10 మంది సభ్యులతో ఎఫ్‌ఎఫ్‌పిఒలు ఏర్పాటు చేస్తున్నారు. మత్స్యకారులు, ఆక్వా రైతులు ఇలా సంఘాలుగా ఏర్పడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేస్తున్నారు. పధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా రానున్న నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎఫ్‌ఎఫ్‌పిఒలకు నిధులు కేటాయిస్తుంది. చేపలు, రొయ్యల సాగు, ప్రాసెసింగ్, అమ్మకం, మార్కెటింగ్‌లు ఎఫ్‌ఎఫ్‌పిఒల ద్వారా చేపట్టడం వల్ల మత్స్యకారులు, ఆక్వా రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మత్స్యకారులు వేట అనంతరం సముద్ర సంపదను ఒడ్డుకు తెచ్చి అమ్మకాలు జరుపుకునేందుకు, వాటిని ఎండ పెట్టుకునేందు కోసం జిల్లాలో ఫిష్ లాండింగ్ సెంటర్లు నిర్మిస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు డీజిల్ కొనుగోలుపై సబ్సిడీ ఇస్తున్నారు. లీటర్‌కు రూ. 9 చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. పెద్ద బోట్లకు నెలకు 3 వేల లీటర్లు, చిన్న బోట్లకు నెలకు 300 లీటర్ల వరకు సబ్సిడీపై డీజిల్ సరఫరా చేస్తారు.

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ చట్టం సవరణ

కేంద్ర ప్రభుత్వం కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ చట్టాన్ని సవరించింది. నూతన మార్గదర్శకాలు ఆక్వా రైతులకు అనుకూలంగా ఉన్నారు. ఆక్వా చెరువుల విస్తీర్ణం 5 హెక్టార్ల వరకు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన కమిటీ రిజిస్ట్రేషన్ చేసేందుకు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీకి సిఫార్సు చేయవచ్చు. ఐదు హెక్టార్ల నీటి విస్తరణ కంటే ఎక్కువ ఉన్న చెరువులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటికి సిఫార్సు చేయవచ్చు. అసైన్డ్ భూముల మరియు సొసైటీ భూముల్లో ఉన్న చెరువులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించారు.

పర్యావరణ హితంగా ఆక్వా ఉత్పత్తులు

పర్యావరణహితంగా ఆక్వా ఉత్పత్తులను సాధించడానికి ప్రపంచ బ్యాంకు రూ.107 కోట్లు రాష్ట్రానికి మంజూరు చేసింది. ఇందులో భాగంగా నిపుణుల బృందం గత నెలలో జిల్లాలో పర్యటించారు. గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీ చైల్డ్ ప్రాజెక్టు ద్వారా ఆక్వా ఉత్పత్తుల నుంచి కార్బన్ ఉద్గారాలు తగ్గించేందుకు శాస్త్రీయంగా కృషి జరుగుతుంది. ఆహారం, వ్యవసాయ సంస్థ ఇటలీ వారి పర్యవేక్షణలో ఈ పథకాన్ని అమలు చేస్తారు.